# ఆ యిద్దరూ

"అనూ, అర్జున్ ఇండియాకు వస్తున్నాట్ట. వాళ్ల అమ్మా నాన్న బొంబాయికి వెళ్ళి రిసీవ్ చేసుకుంటారట"

"మీకెట్లా తెలిసింది?"

"వాళ్ల బాబాయి చెప్పాడు ఇవాళ కోర్టులో కలుసుకున్నప్పుడు."

"ఎన్ని రోజులుంటాడట?"

"ఆ సంగతి చెప్పలేదు. ఒక నెల ఉంటాడు. ఆ నెలలో నలుగురినీ చూసి వెళ్తాడుట"

"మన అమితను గురించి వాళ్ల బాబాయికేమయినా చెప్పారా?"

"వస్తున్నాడుగా అన్నీ కనుక్కుందామన్నాడు"

"మళ్లీ ఎప్పుడువస్తాడో? వచ్చినప్పుడే ఈసారి అన్నీ తేల్చేసుకోవాలి" అన్న పూర్ణమ్మను ఆడపిల్లల తల్లులకుండే బాధ సలుపుతోంది.

''ముందు రానీ''

అన్నపూర్ణకు చిన్నారావుకు కాంతికి పెళ్ళి చెయ్యాలని అనుకుంటున్నప్పటి నుంచీ అర్జున్ మీదికే ఆలోచనలు పోతున్నాయి. అర్జున్ ఇంజనీరింగ్ ప్యాసయి విదేశాలలో ఎమ్‌టెక్ చేయాలని నాలుగేళ్లకిందట వెళ్లేటప్పుడు చిన్నారావు గారింటికి దగ్గర్లోనే ఉండేది వాళ్లఇల్లు. వస్తూపోతూ ఉండేవారు.

''మన స్నేహాన్ని బంధుత్వంకింద మార్చుకుంటే బాగుంటందని నా మనసులో ఉందోయ్ ఏమంటావు గోపీ? మన పిల్లలుకూడా ఈడు జోడుగాఉన్నారు. కలిసి మెలిసి తిరుగుతున్నారు. మా ఆవిడయితే నీతో చెప్పమని ఒకటే పోరుపెడుతోంది'' అన్నాడు చిన్నారావు.

"ఇంకా వాణ్ణి పెళ్ళిసంగతి అడగలేదు. విదేశాలలోగాని ఎమ్‌టెక్ చేయ నంటున్నాడు. రెండు మూడేళ్ళల్లో తిరిగివస్తానంటున్నాడు. పాతికేళ్ళన్నారాంటీ పెళ్ళిమాట లేమిటని నవ్వుతున్నాడు. ఎంతలోకి తిరిగివస్తాయి మూడేళ్లు? ఈసారి రాగానే కదిలిస్తాలే. ఏదో వాడి సరదా కాదనట మెందుకని పంపుతున్నా మంతే" జవాబిచ్చాడు అప్పటికి గోపాలరావు.

అర్జున్, కాంతి గోపాలరావు గారింట్లో బాడ్‌మింటన్ ఆడుతూ ఉండేవాళ్లు. కాంతి స్నేహితురాలు అమితతో కలిసి కాలేజినుంచి రాగానే వెళ్లేది. మరో ఇద్దరు ఇంటరు చదువుకునే విద్యార్థినులుకూడా కలిసేవారు. ఒకే కాలేజిలో చదవటంవల్ల ఆత్మీయత బాగా పెరిగింది. అనిత, కాంతి తమకుప్రియమైన వస్తువులు ఏవి దగ్గ రున్నా ఇద్దరూ పంచుకుని ఆనందించేవారు. పంచుకోవటానికి సందర్భం కుదరక పోతే "అబ్బ అనీ కివ్వకుండా నేను ఒక్కదాన్ని ఎలా తీసుకోను?" అని కాంతి వాపోయేది. ఒక్కదాన్నీతింటే తిన్నట్టుండదు. ఏపనిచేసినా ఇద్దరం కలిసిచేయాలి. అట్లా అలవాటయింది చిన్నప్పటినుంచీ" అని మనసులో మధనపడేది అనీ.

ఇద్దరూ కలిసి అర్జున్‌తో బాడ్‌మింటన్ ఆడేటప్పుడు-కేరమ్స్ ఆడేటప్పుడు రమ్మీ ఆడేటప్పుడు అతడు చూపించే నైపుణ్యాన్ని ఒడుపునూ గమనించిన వాళ్ల హృదయాలు పులకించి పోయేవి అంతరంగాలలో మొలకలెత్తే భావాలు బయటికి కనబడకుండా జాగ్రత్త పడేవారు.

వాటినిమాత్రం ఎవరికివారే మనసులోపెట్టుకుని రహస్యంగా మురిసిపోతూ అతడిని ఒంటరిగా కలుసుకోవటానికి కుతూహల పడేవారు. అతడు స్టేట్సుకువెళ్లిన ఏడాదికి ఇద్దరూ ఇంటరుపాసయి ఒకరు బి.కామ్‌లోనూ, ఒకరు బి.యస్సీలోనూ, చేరారు. కాలేజీలు వేరయినా సాయంకాలపు వేళల్లో కలుసుకుంటూ ఉండేవారు.

ఒకసారి అర్జున్ అనితకు ఉత్తరం రాశాడు. తన చదువు అయిపోగానే ఇండియాకువచ్చి అనితను ఎప్పుడు కలుసుకుందామా అని తన మనసు ఆత్రపడు తున్నట్టు రాశాడు.

"అనితా! నీ ముఖం ఇట్లా వెలిగిపోతోందేమిటివాళ? ఏమయినా కొత్త సంగతా?" కాంతి అనిత భుజంమీద చేతులేస్తూ అడిగింది.

"కొత్త సంగతులు ఏముంటాయి? ఆ కోర్సులో గతిలేక చేరానుగాని-అంత

ఇంట్రస్టింగాలేదు. చేరినందుకు చదువుతున్నాను. ఇష్టంలేనిపని చేయాలంటే ఎట్లా ఉంటుంది? అందుకని ఇవాళ కాలేజికి వెళ్లకుండా హాయిగా క్రైమ్‌థిల్లర్ చదవటం మొదలు పెట్టాను."

"అందుకేనా మబ్బువిడిచిన చంద్రబింబంలా వెలిగిపోతోంది ముఖం?" కాంతి ఆమె జడపట్టుకులాగింది. వాళ్ళిద్దరికీ అదొక సరసం.

నాలుగురోజులయిన తరువాత కాంతికి అర్జున్ దగ్గరనుంచి ఒక రోజ్ కలరు కవరందింది. "అబ్బా, కాంతీ, మనం దూరమయినా మన మనసులు అతి దగ్గరగా ఉన్నట్టనిపిస్తోంది. ఈ వెధవ చదువులూ, డిగ్రీలూ, తొందరలో తెమిలేటట్టులేవు. ఒకటి కాగానే ఇంకొకటి - అది కాగానే ఇంకోటి ఇలా ఒక గొలుసులా ఉంది. ఈ కోర్సు పూర్తి కాకముందే మా ప్రొఫెసరు మరొకటి ప్లాన్‌చేశాడు. మధ్యలో ఒక్కసారైనా ఇండియాకువచ్చి అందరినీచూసి మనసువిప్పి మాట్లాడుకోవాలని తహతహలాడుతోంది నా హృదయం. ఏమిటో? అనుకున్నది అనుకున్నట్టుగా ఏ పనీ చేయ్యలేకపోతున్నా నీమధ్య. ఈ ఉత్తరం నీకురాయాలని వారం రోజుల నుంచీ ప్లాను ఇవాల్టికి పూర్తిఅయింది. నీవు రాసిన ఉత్తరాలు భద్రంగా దాచి పెట్టి అప్పుడప్పుడు చదువుకుంటూ ఉంటాను. నీవు ఎదురుగాఉండి చిలిపిగా నవ్వుతూ మాట్లాడుతున్నట్లే ఉంటుందిసుమా ఆ సమయంలో? 'మనంఎప్పటికయినా కలుసు కుంటామా? అనిపిస్తుంది నాకు ఒక్కొక్కసారి'' అంటూ నాలుగు పేజీలు ఏమి టేమిటో థ్రిల్లింగా రాశాడు.

ఆ ఉత్తరాన్ని కాంతి ఎవరూ చూడకుండా తన బీరువాలో భద్రపరచుకుని ఇంట్లో ఎవరూలేనప్పుడు ఒకసారి చదువుకుంటే తృప్తికలగక మళ్లీ మళ్లీ చదువు కునేది.

అనితను కలుసుకున్నప్పుడు పొరబాటుగానయినా అప్పుడాసంగతి ఎత్తేది కాదు. అది తన ఆంతరంగిక విషయం. అర్జున్ అయినా పొరబాటుగానయినా అనితను తలుచుకోడు. ఎవరయినా మనసుకు నచ్చినవాళ్ళను తప్ప, చూసినవాళ్ళ నందరినీ తలుచుకుంటూ కూచుంటారా?" అనుకునేది.

అనితది ప్రత్యేకమయిన పద్ధతి. ఇంగ్లీషు తెలుగు పుస్తకాలు విపరీతంగా చదివేది. వాటిలోనుంచి తన కిష్టమైన సమాసాలు వాక్యాలు ఒక పుస్తకంలో రాసి పెట్టుకునేది. ముఖ్యంగా రొమాంటిక్ థ్రిల్లర్సులో నుంచి ఎక్కువ రాసి పెట్టు

కునేది. తన మనసు ఏదోలా అయిపోయినప్పుడు ఒక్కతే మేడమీద తన గదిలో కూర్చుని తన మనసులోని ఆర్తిని రకరకాలుగా వర్ణిస్తూ రంగులు రంగులుగా చిత్రిస్తూ, అలలు అలలుగా పొంగిస్తూ, ఒక ప్రణయకావ్యంలా ఆరేడు పేజీలకు తక్కువ రాసేదికాదు.

'అర్జున్' మనకు ఇలా ఉత్తరాలు రాసుకోవటానికి ఇదే మంచి సమయం. నీవు వచ్చాక ఉత్తరాలతో పనేముంది? అయినా వేటి విలువ వాటిదే-ఏమంటావు? అప్పుడు అనుభవంవల్ల కలిగేదితృప్తి. ఇప్పుడు దానికోసంకలిగేది ఆర్తి. ఈ ఆర్తి లోనే కవిత్వంపుట్టేది-మనసులు ఆర్తితోఅలమటించేది. నీవురాసినఉత్తరాలను నేను 5 బై 10 చాకొలేట్ డబ్బా ఒకటి చాకొలేట్లతో నా కిచ్చావు చూడు-దానిలో పెట్టు కొని అపురూపంగా దాచుకుంటున్నాను. నా ఉత్తరాలను నీవేంచేస్తున్నావు? నాకంటె అపురూపంగా దాస్తున్నావా ఏం? దాచి ఉంచు. నీవు వచ్చాక మనిద్దరివీ కలిపి ఒక డబ్బాలో పెడదాము."

రాసిన ఉత్తరాన్ని పదేపదే చదువుకుని తృప్తి కలిగినట్టుగా కళ్లమూసుకుని, తన పెదవులకానించుకుని కవరులోపెట్టి స్వయంగా పోస్టులోవేసి వచ్చేది. వారం రోజులయిన తరువాత, ఈ పాటికి ఉత్తరంచేరేఉంటుంది. చదువుకుని ఆనందంతో గంతులువేస్తాడు. నాలుగైదు రోజులపాటు తీరినప్పుడల్లా మళ్లీ మళ్లీ చదువుకుం టాడు. తన స్నేహితులతో తీపి తీపిగా మాట్లాడుతాడు. ఈ లోపల తనొకటి రాయడూ? రాయకపోతే మనసూరుకుంటుందా?

'కాంతికూ్కడా ఉత్తరాలు రాస్తున్నాడేమో'? ఊహామాత్రానికే మనసు చురుకుమంది. రాయటంలేదని తన మనసు నొక్కి నొక్కి చెబుతోంది.

రాయడు గాక రాయడు. అలా మనసు ఒక నిశ్చయానికి వచ్చిన తరువాత హాయిగా ప్రశాంతంగా ఉండేది.

ఎవరిలో వారే తన కొక్కదానికే ఉత్తరాలు రాస్తున్నాడని మురిసి పోతుండ గానే రోజులు దొర్లిపోతున్నాయి.

అనిత బి.కామ్ పూర్తి చేసింది. ఆమె తల్లిదండ్రులకు ఆమెకింక పెళ్ళి చెయ్యాలన్న ఆలోచన లొచ్చాయి. తీవ్రంగా వెతకటంవరకూ వచ్చింది. పెళ్ళి చూపులకు తమకు నచ్చిన అబ్బాయిని ఆహ్వానించారు-అనితకు తెలియకుండా.

ఆ రోజు అనిత పుట్టినరోజు. ఒక్క అమ్మాయి కనుక తల్లిదండ్రుల స్నేహితులు ఆమె స్నేహితులు అందరూ వచ్చారు. కేండిల్సు ఆర్పటం, కేకులు కొయ్యటం, పాటలు పాడటం అయిన తరువాత కొందరు ఆహూతులకు అనితచేత ప్రత్యేకంగా టిఫిన్లు పెట్టించారు. కొందరు పెద్దవాళ్లు ఆమె ఏంచదువుతున్నదో తెలుసుకున్నారు. ఆహూతులు ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నప్పటికీ ఆమె చేత పాటలు పాడించారు.

వాళ్ల వెళ్ళిన తరువాత స్నేహితులు తాము తెచ్చిన గిఫ్ట్సు ఒక్కొక్కటే బైటికితీసి ఆమెకిచ్చారు.

కాంతి ఆమెకు ప్రత్యేకంగా పైటపిన్ను బహూకరించింది.

"అనితా! ఈసారి చాలామంది అతిథులొచ్చినట్టున్నారు. ప్రత్యేకత ఏమన్నా ఉందా?" కుతూహలంతో అడిగింది కాంతి.

"మా నాన్నగారి ఆఫీసులో ఒకరికి ట్రాన్సఫరయిందట. ఆఫీసు వాళ్లందరినీ పిలిచారు. మా అమ్మ తన స్నేహితురాళ్లనూ కొంతమంది బంధువులనూ పిలిచింది. ఈ సారి పిలిచిన వాళ్లంతా వచ్చారు."

"ఒక యువకుడు ఒక పెద్దాయన ఆడవాళ్లదగ్గరకూర్చుని ఏమిటో అడుగుతున్నారు. ఆ యువకుడు నిన్నేచూస్తూ కూర్చున్నాడు ఉన్నంత సేపు? నిన్ను పలకరించాడు. నీవుకూడా ఏహో జవాబులిచ్చావు?" కాంతి వివరాలలోకి దిగింది.

"నేను ఒక్కరితోకాదు అందరితోనూ మాట్లాడాను. 'ఇంకా చదువుతావా? ఇంటిపనులేమయినా వచ్చునా?' అని పెద్దవాళ్ళడిగే ప్రశ్నలేగా ఇటువంటివన్నీ?" తేలికగా మాట్లాడింది అనిత నవ్వుతూ.

"ఏదో ఉంది సంగతి. ఇది నిజమయి, దీని పెళ్ళి తొందరగా అయితే, బాగుండు"నని వెయ్యిదణ్ణాలు పెట్టుకుంది మనసులో కాంతి.

ఆ సంబంధం అనిత తండ్రికి నచ్చలేదు. పిల్లవాడు డాక్టరేగాని ఇంకా పై చదువులు ఈ దేశంలోనయినా చదువుదామన్న ఆశయంలేదు. ఎం.బి.బి.ఎస్. అయితే చాలనుకునేరకం. సగటుకుటుంబం. పిల్లలు ఆడమగాకలిసి ఎనిమిదిమంది ఉన్నారట. ఇంతమంది పిల్లలున్న కుటుంబంలోకి అమ్మాయిని పంపటం ఇష్టం

లేదు. ఒక్క అబ్బాయి-ఒంటరికాపురం-విదేశాలకు వెళ్లాలన్న ఆశయంతో చురుకుగా ఉండే సూచనలు ఆయనకు కనబడలేదు. "మంచిది వెళ్ళిఉత్తరం రాస్తామ"ని వాళ్లు లేవగానే సాగనంపారు మౌనంగా.

మరొక సంబంధం పండగపేరుమీద ఆహ్వానించబడి కాఫ్యాదులు సేవించి వెళ్లారు.

కాలేజీలు తెరవగానే అనిత ఎం.కామ్‌లో చేరింది.

ఒకరికి తెలియకుండా ఒకరు అర్జున్‌కి ఉత్తరాలు రాస్తునేఉన్నారు. అందుకుంటునే ఉన్నారు.

అర్జున్ విషయంతప్ప మిగతా కబుర్లు చెప్పుకోటానికీ, కాంతికేమయినా సంబంధం కుదిరిదేంమోనని అనిత-అనిత కేమయినా సంబంధం కుదిరిందేమోనని కాంతి ఆరాలు తియ్యటానికి కలుసుకుంటునే ఉండేవారు. ఇద్దరూ ఆ విషయంలో నిండుకుండలు. పైకి పాకేవారుకారు.

ఆనాడు కాంతిసెలవుపెట్టింది. మంచి ఆకర్షణీయమైన దుస్తులుధరించింది. హేర్‌స్టైల్ మార్చింది. పెదవులకు గోళ్ళకు రంగులేసింది లూనామీద ఎయిర్‌పోర్టుకు వెళ్ళి లాంజిలో కూర్చుంది. అర్జున్ తల్లిదండ్రులూ పినతండ్రీ అంతకు ముందే వచ్చి కూర్చున్నారు బొంబాయివరకూ వెళ్లలేక.

బొంబాయి నుంచి వచ్చే ప్లేన్ ఐదునిమిషాలలో హైదరాబాదు ఎయిర్‌పోర్టుకు వస్తున్నదన్న ఎనౌన్సుమెంటువిని అందరూ లేస్తూఉండగా - అనిత-నిసర్గ సుందరి-అలంకారాల దిద్దుబాటుతో మిలమిల మెరుస్తు లాంజిలోకి వచ్చింది.

"ఓ అనితా! నీవుకూడా ఎయిర్‌పోర్టుకి వచ్చావు. ఏమిటి విశేషం" అంటూ అనిత చెయ్యందుకుంది కాంతి.

"మా వాళ్ళెవరో వస్తున్నారట. మా నాన్నగారు రిసీవ్ చేసుకుని ఇంటికి తీసుకు రమ్మన్నారు" అంది మెల్లగా.

"మరి-నీవు?"

"మా పెద్దమ్మకూతురు బొంబాయినుంచి వస్తోంది. 'ఒక్కతే వెతుక్కుంటు రావటమెందుకు? నీవు వెళ్ళి యింటికి తీసుకురా'అని అమ్మ పంపింది.

"తమాషాగా ఇక్కడ కలుసుకున్నాము" అనుకున్నారు.

అంతలో అందరూ వాళ్ల వాళ్లను కలుసుకోవటానికి ముందుకు నడిచారు.

గుంపులోనుంచి రావటానికి కొంత ఆలస్యంపట్టింది. ఎన్‌ట్రెన్సుకు దగ్గరగా నిలబడ్డారు అర్జున్ తల్లితండ్రులు. అర్జున్ నవ్వుకుంటూ గుంపులో నుంచి బయట పడి వస్తున్నాడు. అతడి పక్కన-వెనక-ముందు జనం.

కాంతీ అనితాకూడా అతడినిచూడగానే ఆనందపడి పోయారు. హృదయాలు ఉప్పొంగి పోయాయి.

అర్జున్ ఎదురుగా ఆనందంతో నిలబడ్డ తల్లిదండ్రులను కౌగలించుకున్నాడు.

"అమ్మా ఈ అమ్మాయి శిరీష మీ కోడలు. వీడు అఖిలేష్ మీ మనమడు" అంటూ భార్యనూ కొడుకునూ పరిచయం చేశాడు.

తల్లిదండ్రులు మొదట నిర్ఘాంతపోయినా 'మన దేశంపిల్లే'నని సంతృప్తి చెందినట్టున్నారు. దీవించినట్టుగా తలమీద చెయ్యివేసి నిమిరారు.

అర్జున్ పినతండ్రికి హలోచెప్పి "కాంతీ అనితా మీరిద్దరూకూడా వచ్చారా? చాలా సంతోషం. మీట్ మై వైఫ్ అండ్ సన్" అంటూ కరచాలనం చేశాడు.

వాళ్ళిద్దరూకూడా పైకి సంతోషాన్ని వెలిబుచ్చారు. అతడి భార్యనూ పిల్ల వాడినీ పలకరించారు. గరళకంఠుడి మాదిరిగా.

సామాన్లు రాగానే ఆ కుటుంబం కారులో వెళ్ళిపోయింది. రోజంతా కాసేపు ఇటూ అటూ తిరిగారు అనితా కాంతీ చెరొక వైపు. పావుగంట తరువాత కలుసుకుని "మీవాళ్లు రాలేదేమిటి?" అనిత అడిగింది.

"రానట్టే, వస్తే కనబడరూ?" అంది కాంతి.

"మీ వాళ్లు వచ్చారా?" అడిగింది అనితను కొంత సేపయినా తరువాత.

"రాలేదు. అయినా మగవాళ్లుకూడా ఉన్నారుకదా. ఆ గుంపులో వెళ్ళిపోయి ఉంటారు. వాళ్లకు నా ముఖం సరిగా తెలియదు. నేను ఇంటికి వెళ్ళేసరికి వచ్చి ఉంటారు. ఇవాళ అమ్మచేత చివాట్లు తినిపిస్తారు" అంది.

గంభీరమయిన హృదయాలు రెండూ ఒకదానికి తెలియకుండా మరొకటి-

లోపల భగ్గుమంటున్నా పలకరించుకుని-పెదవులపై నవ్వు తెచ్చుకుని ఇంటిదారి పట్టారు.

'మళ్ళీ యింటికెందుకు క్లాసుకు వెళ్ళితేనేసరి' అనుకుంటూ మధ్య దారిలోనే అనిత కాలేజికి వెళ్ళింది.

సెలవు ఎట్లాగూ పెట్టానుకదా అని కాంతి ఇంటికి వెళ్ళింది.

తన పడకమీద బోర్లాపడుకుని అసూయతో మండిపోతున్న హృదయాన్ని నొక్కిపెట్టి "ఎంత మోసం - ఎంత మోసం" అనుకుంటూ కన్నీరు కార్చికార్చి నిద్రలోకి జారుకుంది కాంతి.

పది రోజులు మూగగా గడిచాయి.

మరొకసారి కాంతి అనిత ఎక్కడో తారసిల్లారు.

"అనితా! మనం ఒక మాటు మర్యాదకయినా అర్జున్ యింటికివెళ్ళి, వాళ్లను చూసివస్తే బాగుంటుంది. ఎంతయినా మనం వాళ్ళింట్లో ఆడుకున్న వాళ్లంకదా? వెళదామా?" కాంతి అనిత ముఖంలోకి చూసింది.

అనితకు కడుపులో అగ్ని రగులుకుంటునేఉంది.

కాంతికి నివురుగప్పిన నిప్పులుఉన్న సెగ భగభగ మండుతూ పైకి లేస్తున్నది.

పైకి లేవకుండా లోపలవిజృంభిస్తున్న బడబాగ్నిని ఒకరికి తెలియకుండా ఒకరు అణిచి పెట్టటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

"వెళ్ళితే తప్పేంలేదు. మన మర్యాద మనం దక్కించుకున్న వాళ్ళ మవుతాము" అంది అనిత నీరసంగా.

''ఎప్పుడు వెళ్దామంటావు?'' కాంతి ప్రశ్న.

''ఎప్పుడయినా సరే. నీకు వీలయినప్పుడు చెప్పు?''

ఒకనాడు ఇద్దరు తీరికచేసుకునివెళ్లారు. అర్జున్ అమ్మగారు. "మా అబ్బాయి కోడలు పిల్లవాడు వచ్చారు. పైనున్నారు. కాఫీ వేళకు దిగి వస్తారు. కూర్చోండి" అని హాల్లోకి తీసుకు వెళ్ళి సోఫాలో కూర్చోబెట్టింది.

అరగంట తరువాత ఒక్కొక్కళ్ళే దిగివచ్చారు.

"కాంతీ అనితా వచ్చారు మిమ్మల్ని చూడటానికి హాల్లో కూర్చున్నారు. మీరు మాట్లాడుతూ ఉండండి" అని ఆమె కాఫీ టిఫిన్ తీసుకురావటానికి లోపలికి వెళ్లారు.

అర్జున్ అతడివెనక పిల్లవాడినెత్తుకుని భార్యా హాల్లో సోఫాలల్లో కూర్చున్న తరువాత ''ఎంతసేపయింది వచ్చి? మీ యిద్దరూ ఏంచేస్తున్నారు?''అని అడిగాడు.

చాలా మామూలుగా ఇద్దరూ జవాబు చెప్పారు.

''ముందు ఏంచెయ్యాలనుకుంటున్నారు? ఇద్దరూ పోస్టు గ్రాడ్యుయేట్సు అయ్యారు. ఫారెన్ట్రిప్ ప్లాన్ చేస్తున్నారా?''

ఆ ప్రశ్నకు ఇద్దరూ ఉద్రేకంతో ఎగిసెగిసి పడుతున్న గుండెలను అదిమి పెట్టుకొన్న తరువాత - ''ప్లాన్ చేసుకున్నాము. మాకు స్కాలర్‌షిప్పుకూడా వస్తుంది'' మామూలు మాటగా చెప్పింది అనిత-ఇద్దరిపక్షాన-అతడికంటె తమదే పై చెయ్యనిపించేటట్టు.

కాంతి తన నివ్వెరపాటును పెదవుల మధ్య బిగించి పెట్టింది.

ఐదు నిమిషాలయిన తరువాత అర్జున్ తల్లి తెచ్చిన కాఫీ టిఫిన్ తీసుకుని లేచారు.

''నన్ను మర్చిపోకుండా చూసి పోదామని వచ్చిన మీ యిద్దరికీ నా పక్షాన నా భార్య పక్షాన ధన్యవాదాలు'' అంటూ చేతులు జోడించి గేటు వరకూ సాగనంపాడు అర్జున్ ఏమి ఎరగని వాడిలా.

దారిలో ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు.

''ఇప్పుడేఇంటికెందుకే కాంతీ? కొంచెంసేపు ఎక్కడయినా కూర్చుందాం''

వాళ్ళిద్దరికీ అలవాటుగా కూర్చుని కబుర్లు చెప్పుకునేచోటు హుసేన్‌సాగర్ టాంక్‌బండ్ మీద ఉన్న సిమెంటుసోఫా. బోట్‌క్లబ్బును, నీటి అలలమీద కిందికి పడుతూ మీదికెగుస్తూ తిరిగే చిన్న చిన్న బోట్లనూ, సముద్రపు టలల మాదిరిగా ఎగిసెగిసి పడాలని ప్రయత్నించే హుసేన్‌సాగర్‌లోని కెరటాలనూ చూస్తూ

కూర్చున్నారు మాటల్లేకుండా. వచ్చారుగాని-మాటలు నోళ్ళలోనుంచి పెకలటం లేదు.

కొంతసేపు లయన్సుక్లబ్బు ఆవరణంలో తిరిగారు.

కొంతసేపటికి కాంతి-

''అనితా కొత్తవాళ్ళను పలకరించినట్టుగా ఆ పలకరింపుచూశావా అర్జున్‌ది ఎట్లాఉందో? గేటువరకూవచ్చి ఆ సాగనంపటం అంతాచూస్తే....''

''చాలా అసహజంగాఉంది. ఇదంతా భార్యముందు పెట్టిన పోజు''

''అంత భయమా భార్య అంటే?''

''విదేశాలనుంచి వచ్చినవాడికికూడా అంత భయమా?''

''ఆ దేశాలలో అదొక ఎటికేట్''

''నాకలా అనిపించలేదు. అతడొక అమాయకుడని భార్య అనుకోవాలని''

''రెండూ ఒకటేగా?''

"సర్లే వాడెట్లాఉంటే మనకేం? మన మర్యాద మనం దక్కించుకున్నాం" అక్కడినుంచే ఇద్దరూ విడిపోయారు.

కాని ఇద్దరి మనసులూ కలవర పడుతూనే ఉన్నాయి.

కొన్ని నెలల తరువాత మళ్లీ యిద్దరూ కలుసుకోవటం తటస్థించింది.

కాంతి మనసులో ఒక అనుమానం ఛాయామాత్రంగా మెదిలింది. తనకు రాసినట్టే అనితకుకూడా ఉత్తరాలు రాసిఉంటాడా అర్జున్?

ఇదెలా తెలుస్తుంది?

స్నేహితురాలిగా అడిగితే చెప్పదా అనిత?

'అతడి సంగతి తేలిపోయింది. ఇప్పుడు అడిగితే ఏం? ఎందుకుచెప్పదు?'

క్లబ్బులో కలుసుకున్న అందరూ వెళ్లిపోయాక - కేర్‌టేకర్ తోటమాలి మాత్రమే ఉన్నప్పుడు—

"అనితా! నీ మనసింకా సర్దుకోనట్టుందే? అయిపోయిన దానికి విచార మెందుకే?"

ఆ మాటలకు అనిత ముఖంలో కళతప్పింది. కొంత సేపటికి సర్దుకుని "కాంతీ! నీవు నాస్నేహితురాలివి. నీవన్నట్టు అంతా అయిపోయిన తరువాత నీముందర బయటపెట్టటానికి నాకేం సంకోచం? ఒకసారి మాయింటికిరాగలవా?" చేతులుపట్టుకొని అడిగింది.

''నీకు మనశ్శాంతిగా ఉంటుందంటే తప్పకుండా వస్తాను. పద''

ఇద్దరూ కదిలి, గేటుదాటగానే వాళ్ళ పోకడకోసం ఎదురుచూస్తున్న కేర్ టేకర్ దీపాలు ఆర్పేసి గేటు మూశాడు.

అనిత తన గదిలోకి కాంతిని తీసుకెళ్ళి మంచమ్మీద కూర్చొబెట్టి, తన అల్మేరా తెరిచి ఒకకట్ట ఉత్తరాలు ఆమె ముందరపెట్టింది.

"చూడుకాంతీ! ఎన్నాళ్ళు రాశాడో-ఎట్లారాశాడో? తన మనసంతా కరిగించి పోశాడే ఈ ఉత్తరాలలో? అటువంటి అర్జున్ నన్ను....నన్ను....మరిచిపోయి ఇంకో పిల్లను పెళ్ళి చేసుకుంటాడా? కనీసం సారీ అనైనాచెప్పి పెళ్ళి చేసుకోవచ్చుగా? పైగా అభిమానం విడిచిపెట్టి మనం వెళ్ళినప్పుడు-పరాయి వాళ్ళతో మాట్లాడినట్టు పొడిపొడిగా మాట్లాడతాడా? వాడుమనిషేనంటావా? అందులోచదువుకున్నవాడు?" కన్నీళ్లకార్చింది ముఖం పక్కకు తిప్పుకుని.

కాంతి వాటినన్నిటినీ వివరంగా చదివింది.

"అనితా! నిన్ను చాలా అన్యాయం చేశాడు. నిజమే కాదనను కాని - నీవు ఇప్పుడు వాటిని మళ్ళీమళ్ళీ చదువుకుంటూ, వాటిని ప్రాణప్రదంగా కాపాడనవసరం లేదు. మనసులోనుంచి తుడిచిపారెయ్. కాఫీలో ఈగపడితే ఏంచేస్తాం? ఖరీదయిన పాలు-అంతకంటె వెలగలడికాక్షన్ చక్కరకూడా వేశామనుకుంటామా? ఈగపడితే పనికిరాదని ఘుమఘుమలాడుతూ గుటకలు మింగించేదయినా పారబోస్తామా లేదా? అట్లా-గే వీటినికూడా-'ఎంత తెలివితక్కువదాన్ని' అనుకుంటూ అగ్గిపుల్ల వెలిగించు వాటిమీద. నీ బాధ ఉపశమిస్తుంది కాలిపోతున్న ఆ ఉత్తరాలనుచూసి, మాడి మసి

అయిపోతున్న ఆ అక్షరాలనుచూసి, మనసును శాంతింపచేసుకో" అనితను దగ్గరకు తీసుకుని కళ్ళు తుడిచింది.

"పొద్దుపోయింది. నేను వెళ్ళిరానా? నాన్నకు దగ్గుగాఉంది. మందు తీసు కెళ్లాలి" అంటూ నడిచి వెళ్ళింది కాంతి.

ఆ రాత్రి కాంతికి కంటిమీద కునుకులేదు.

మంచమ్మీద లేచికూచుంది. తలవెంట్రుకలు సద్దుకుని మళ్ళీ క్లిప్పులు పెట్టుకుంది. లేచి బీరువాతీసి సొరుగులో రిబ్బనుకట్టి భద్రంగా సెంటుపూసి దాచిన ఉత్తరాల కట్టను బైటికితీసి ఒక్కొక్కటే చదువుతూ కన్నీటి బొట్లు రాలుస్తూ "ఇవి ఉత్తరాలా? కావు-కావు-ఇవి ఒక్కొక్కటి ఒక్కొక్క కావ్యం. ఒక్కొక్కమాట ప్రణయానికి ప్రాణం పోస్తుంది. పాటలా పాడిస్తుంది. దేహాన్ని పులకరింప చేస్తుంది. ఇటువంటిఉత్తరాలు రాసినవాడు రాస్తున్నంత సేపయినా నావాడుగా నన్ను మనసులో పెట్టుకొని రాశాడు. నామనసును స్పందింపచేసి తహతహలాడించాడు.

కాని, అనితకు రాసినఉత్తరాలను వీటితోపోలిస్తే ఎంత పేలవంగాఉన్నాయి? వట్టి పొడిఅక్షరాలు. వాటికేం విలువఉంది? వాటినే చూసుకుంటూ కన్నీరు కారుస్తున్నది అమాయకురాలు. అనితేకనుక వీటినిచూస్తే ఎంత అసూయపడుతుందో!

"జీవితమంతా వీటిని చదువుకుంటూ గడపటానికి ఈ ఉత్తరాలు చాలవూ? ఆ త్రిలోనే సుఖం ఆనందం ఉంటాయనిపిస్తోంది.

కాలం గడుస్తున్నది. తల్లిదండ్రులు సంబంధాలు తీసుకు వస్తున్నారు. అనితా కాంతీ తిరగ్గొడుతున్నారు.

కాని ఉన్నట్టుండి అనిత ఒక సైంటిస్టును పెళ్ళిచేసుకుని కెనడా వెళ్ళిపోయింది. ఇప్పుడామెకా ఉత్తరాలే జ్ఞాపకంరావటంలేదు-కొత్త మనిషి-కొత్తజీవితం-మరి.

కాంతి అనితలా మనసును సరిపెట్టుకోలేకపోయింది. మనసు కుంగిపోయినప్పుడు గదిలోకూర్చుని ఆ ఉత్తరాలను చదువుకుని మనసును ఉత్సాహంతో నింపుకునేది. కొడిగట్టినదీపాన్ని పుల్లతో మసిని దులిపితే కాంతివంతమయినట్టుగా మనసు ఉత్సాహంతో పొంగులు వారేది.

తల్లిదండ్రుల కొక్కతే కూతురు. వాళ్లను చూసుకుంటూ ఆ ఉత్తరాలు చదువుకుంటూ ఉద్యోగంచేస్తూ కాలాన్ని ఈడ్చుకు వస్తున్నది కాంతి.

కాని ఆమె మాత్రం అలా అనుకోలేదు. కొత్తగా-క్రొంగ్రొత్తగా నిత్య నూతనంగా ఉత్సాహపరచే ఆ ఉత్తరాలు ఏనాటివో పాతవి అని అనుకోదు. ఆ పరవశం, ఆ ఉత్సాహం అప్పటికప్పుడు వచ్చిన ఉత్తరాలవల్ల కలిగినట్లనిపిస్తుంది.